క్లుప్తంగా

పెనుబర్తిలో రుద్రాభిషేకం



ఎనుబర్తి గ్రామంలో పూజలు చేస్తున్న అర్చకులు

రాపూరు : మండలంలోని పెనుబర్తిలో సోమవారం శివమాల వేసిన శివ భక్తులు ఇరుముడితో శ్రీశైలం వెళుతున్న సందర్భంగా శివుడికి రుద్రాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లీలామోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ మందిరంలో శివలింగాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు.

గిరిజనులకు సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని సోమసానిగుంట పంచాయతీ వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీ వాసులకు సోమవారం తహసీల్దార్ పద్మావతి వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ సెక్రటరీ ముప్పాళ్ల సుబ్రమణ్యం రాజు సహకారంతో నిత్యావసర సరుకులు అందజేశారు. కాలనీ వరద ప్రభావిత ప్రాంతం కావడంతో గిరిజనులు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ముప్పాళ్ల సుబ్రమణ్యం రాజు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున, సర్పంచ్ చెంచులక్ష్మి, నేతలు శివయ్య, చలపతి, రవి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



ప్రజలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న నాయకులు, సచివాలయ ఉద్యోగులు

నాయుడుపేట టౌన్ : భారీ వర్షాలకు మున్సిపాలిటీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. ఆమె సోమవారం కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి నాయుడుపేటలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు, విరిగి పడిన చెట్లను తొలగించారు. వైఎస్సార్ సీసీ నాయకుడు చెందేటి వెంకటేశ్వర్లు లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. కౌన్సిలర్ షేక్ షబ్బీర్ పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

యుద్ధప్రాతిపదికన పనులు

నాయుడుపేట టౌన్ : భారీ వర్షాలకు నాయుడుపేట డివిజన్‌లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయని, యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు ఏపీఎస్పీ డీసీఎల్ ఈఈ ప్రసన్నకుమార్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వినియోగదారులకు 24 గంటలూ అత్యవసర సేవలు అందించేందుకు స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 7382623178 నంబరు ఫోన్ చేసి సత్వర సేవలను పొందవచ్చన్నారు. నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు వాలిపోతున్నాయని తెలిపారు. ముందస్తుగా మరో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజలకు సత్వరం సహాయం



వైఎస్సార్ కాలనీలో జేసీబీతో పనులు చేయిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

చిల్లకూరు: భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అధికారులు సత్వరం సహాయక చర్యలు చేపట్టారు. చిల్లకూరు, చింతవరం, తిప్పగుంటపాళెం, వరగలి, అంకులపాటూరు గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఏఈ మునిశేఖర్ దగ్గరుండి మరమ్మతు పనులు చేయించారు. చిల్లకూరు రెవెన్యూ కార్యాలయం సమీపంలోని వైఎస్సార్ కాలనీలోకి నీరు చేరడంతో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ జేసీబీతో కాలువలు తీయించి నీటిని బయటికి తరలించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ రమ్య స్వాతి, వీఆర్వో రమణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ

కోట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి సోమవారం ఇంట్లో జారి పడి గాయపడ్డారు. ఆయనను కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామానికి చేరుకుని వినోద్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు.

గూడూరు రూరల్ : తుంగపాళెం వద్ద నీట మునిగన నారుమళ్లు



గూడూరు రూరల్ : చెన్నూరు బీసీ కాలనీ వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



గూడూరు రూరల్ : సైదాపురం రోడ్డులో పోలీసుల కాపలా



చిల్లకూరు : ఉప్పుటేరు వద్ద సహాయక చర్యలపై చర్చిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎస్పీ



చిల్లకూరు : తిప్పగుంటపాళెంలోని పునరావాస కేంద్రంలో అల్పాహారం అందజేస్తున్న అధికారులు



హోరుగాలి.. జోరువాన

- పొంగిన కాలువలతో దెబ్బతిన్న రోడ్లు
- నీట మునిగిన పంట పొలాలు
- కూలిన విద్యుత్ స్తంభాలు
- స్తంభించిన రాకపోకలు



తనియాలి వద్ద కాళంగి నదిలో వరద ప్రవాహం



కోట: గోవిందపల్లి వద్ద చెప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

సైదాపురం: మండలంలో సోమవారం ఉదయం నుంచి హోరు గాలితో పాటు జోరున వర్షం కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. సైదాపురంలో రోడ్డులఅట పడిపోయిన రెండు భారీ చెట్లను తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు జేసీబీతో తొలగించారు. లోతట్టు ప్రాంతాల వారి కోసం గులించెర్ల, తోచాం, చీకవోలు, సైదాపురం, రామసాగరం, మొలకలపూండ్ల, గిద్దలూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ, పాఠశాల భవనాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేశామన్నారు. వరద బాధితులకు మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, రాంగోపాల్‌రెడ్డి, సైదాపురం సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ శివకుమార్ ఆహార పొట్లాలు అందజేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదేశించారు. జోరుగా ప్రవహిస్తున్న కైవల్యానది, ఊటుకూరు వద్ద ఉన్న మాలేరు, తురిమెర్ల వద్ద ఉన్న పిన్నేరు వాగుల వద్ద ఎస్ఐ చల్లావాసు గస్తీ ఏర్పాటు చేశారు.

దీవీ సత్రంలో..

దొరవారిసత్రం: మండలంలో సోమవారం సాయంత్రం వరకు ఎడతెరపిలేకుండా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నెర్రికాలువ, కన్నాకాలువ, పాలకాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పూలతోట వద్ద కన్నాకాలువ ప్రవాహానికి సూళ్లూరుపేట–కోట రోడ్డు దెబ్బతినింది. కుప్పారెడ్డిపాళెం పాలకాలువ బ్రిడ్జి మునిగిపోవడంతో వెదురుపట్టు, ఎస్టీ కాలనీ, వెదురుపట్టురాజుపాళెం గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించాయి. తనియాలి గ్రామ సమీపంలో కాళంగి నది నిండుగా ప్రవహిస్తోంది. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. తనియాలి, ఉచ్చూరు, సింగనాలత్తూరు, పూలతోట, వెదురుపట్టు, మొదుగులపాళెం తదితర గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫారంలు నేలకొరిగాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ తెలిపారు. మూడు రోజులకు 257.4 మి.మీల వర్షపాతం నమోదైనట్టు తహసీల్దార్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. మండలంలో 105 చెరువులుండగా 20 చెరువుల్లోకి 90 శాతం వరకు నీరు వచ్చినట్టు ఇరిగేషన్ ఏఈ కస్తూరయ్య తెలిపారు. కాళంగి నది, పాలకాలువ, కన్నాకాలువ, నెర్రికాలువలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్లకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ తిరుమలరావు, మండల అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పొంగిన ఉప్పుటేరు

చిల్లకూరు : మండలంలో కురుస్తున్న భారీ వర్షానికి ఉప్పుటేరు పొంగి ప్రవహిస్తోంది. అధికారులు సోమవారం తిప్పగుంటపాళెం వద్దకు చేరుకుని వరద ఉధృతిని పరిశీలించారు. గ్రామంలోని వారు బయటకు రాకుండా హెచ్చరికలు జారీ చేశారు. పారిచెర్లవారిపాళెం, తీపనూరు, నెలబల్లిరెట్టపల్లి కాజ్‌వేలను తనిఖీ చేసి రాకపోకలను నిషేధించారు. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తిప్పగుంటపాళెం వాసుల కోసం ప్రాథమిక పాఠశాల, తిప్పపై ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి భోజన సదుపాయం కల్పించినట్టు తెలిపారు. మత్స్యశాఖ ద్వారా రెండు ఇంజిన్ బోట్లను సిద్ధం చేసినట్టు చెప్పారు. తొణుకుమాల గ్రామం ఎస్టీ కాలనీలోని ఇళ్లలోకి మోకాటి లోతు నీరు చేరింది. వారిని ఎంపీడీవో వెంకటసూర్యసాయి పంచాయతీ కార్యదర్శి ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించి భోజనం ఏర్పాట్లు చేశారు. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, రూరల్ సీఐ దశరథ రామారావు, ఎస్ఐ అంజిరెడ్డి, ఆర్ఐ రమ్యస్వాతి తదితరులు పాల్గొన్నారు.

తడలో...

తడ: మండలంలో తీవ్ర గాలులు, భారీ వర్షాలతో ఎటు చూసినా నీరే కనిపిస్తోంది. ఎగువన కురుస్తున్న వానలకు పాముల కాలువ, కరిపేటి కాలువ, కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో ఆదివారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కటారి జయజయరావు, ఎంపీడీవో ఆమోసుబాబు, సచివాలయ సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. అనపగుంట, తడకుప్పం తదితర లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. తడ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే ఆర్ముగం పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మామిడికాలువలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పాలచ్చూరు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. పొలాలు, గుంతలు, చెరువుల్లోకి నీరు చేరింది. కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిపై రాకపోకలను నిలిపేశారు. శిరసనంబేడు వరవ కాలువ, చావలి వ్యవసాయ కాలువ, భీమవరం, పాలచ్చూరు సప్లయి చానళ్లు జోరుగా ప్రవహిస్తున్నాయి. తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్ కానూరు, రోసనూరు, ఎగువతాగేలి ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

రాపూరులో..

రాపూరు: మండలంలో సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. చలిగాలులు వీచడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రెవెన్యూ సిబ్బంది అప్రమత్తం ఉంటూ మండలంలోని గ్రామాల పరిస్థితిని పరివేక్షిస్తున్నారు. రాపూరు– నెల్లూరు రోడ్డులో చెట్టు పడిపోవడంతో రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది.

ఓజిలిలో...

ఓజిలి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓజిలి, వెంకటరెడ్డిపాళెం, కొండవల్లిపాడు, మానమాల రోడ్లలో చెప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ శివరామసుబ్బయ్య పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ముమ్మాయిపాళెం గిరిజన కాలనీలో ఈదురుగాలులకు చెట్టు విరిగి పడడంతో రాపూరు పోలయ్యకు గాయాలయ్యాయి. కుందాం గ్రామానికి చెందిన వెంకటయ్య ఇల్లు పాక్షికంగా దెబ్బతినింది.

కోటలో..

కోట: భారీ వర్షాలకు సోమవారం కర్లపూడి వద్ద నున్న సానమాలదిబ్బ గిరిజన కాలనీలోకి నీరు చేరింది. వారిని అధికారులు పునరావాస కేంద్రానికి తరలించి వసతి కల్పించారు. స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గూడలి, గోవిందపల్లిపాళెం వద్ద చప్టాపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు స్తంభించాయి. మామిడి కాలువ ఉప్పొంగడంతో రుద్రవరం, ఊనుగుంటపాళెం ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. సిద్ధవరం బ్రిడ్జి సమీపంలో రోడ్డు కోతకు గురవడంతో అధికారులు అప్రమత్తమై మరమ్మతులు చేపట్టారు. కోట, పుచ్చలపల్లి, కర్లపూడి, సిద్ధవరం, గోవిందపల్లి, కొత్తపట్నం, రుద్రవరంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ కొత్తపాళెం, నెల్లూరుపల్లిలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, ఎస్ఐ పుల్లారావు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



రాపూరు: తూమాయి వద్ద పడిపోయిన చెట్టు. నిలిచిన వాహనాలు

ప్రజలకు సహాయక చర్యలు



కిలివేటి సంజీవయ్య ఎమ్మెల్యే

నాయుడుపేట టౌన్ : భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సహాయక చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజవర్గంలో పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడానికి ఆదేశాలు జారీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైనా అవసరమైతే 9490739223కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు.

ఉధృతంగా స్వర్ణముఖి నది ప్రవాహం



స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద పహారా కాస్తున్న ఎస్ఐ వేణు, పోలీస్ సిబ్బంది



పండ్లూరు రోడ్డులో ప్రజలకు సూచనలిస్తున్న సీఐ నరసింహారావు

నాయుడుపేట టౌన్ : భారీ వర్షానికి స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం తెల్లవారుజాము నుంచి వరద నీరు కాజ్‌వేను తాకుతోంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. కాల్యాణి డ్యామ్ గేట్లు ఎత్తివేస్తున్నట్టు సమాచారం అందడంతో సీఐ నరసింహారావు, ఎస్ఐ వేణు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు స్వర్ణముఖి నది వద్దకు చేరుకుని రాకపోకలను నిషేధించారు. వాహనాలను తుమ్మూరు, కొత్తపల్లి మీదుగా మేనకూరు, వెంకటగిరి వైపు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

దక్కిలి: భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఆయన సోమవారం ఎంపీడీవో ప్రసన్నకుమారితో కలిసి మాటుమడుగు ఎస్టీ కాలనీ, శ్రీపురం, ఎస్సీ కాలనీ, దగ్గవోలు ఎస్టీ కాలనీ, మార్లగుంట ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. స్థానికులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సిబ్బందితో సమావేశమై సమీక్షించారు. ఏ చిన్న సమస్య ఎదురైనా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందజేయలన్నారు. ఈవోపీఆర్‌డీ షేక్ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా నీరే

గూడూరు రూరల్: మండలంలో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో ఎక్కడ చూసినా వరద నీరే కనిపిస్తోంది. జనజీవనం స్తంభించింది. పలుచోట్లు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు, వంకల వద్ద రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ సిబ్బందిని కాపలా ఉంచారు. పలు కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. పలుచోట్లు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

బాలాయపల్లిలో..

బాలాయపల్లి (డక్కిలి) : మండలంలో ఆదివారం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురవడంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలకు ఇబ్బంది పడకుండా ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసులు తెలిపారు. వెంకటగిరి–గూడూరు రోడ్డులోని బాలాయపల్లి హైస్కూల్ వద్ద, మల్లెమాల రోడ్డులో చెట్లు కూలాయి. విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన చెట్లను తొలగించారు.

డక్కిలిలో..

భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పేర్కొన్నారు. నిండలి సమీపంలో ఉన్న కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని 20 గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించాయి. వెంకటగిరి–గూడూరు నేరేడు కాలువ జోరుగా ప్రవహిస్తోంది. వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ వీరనారాయణ వాగులు, వంకల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం): భారీ వర్షానికి వెంకటగిరి పట్టణంలో సోమవారం నాలుగు చోట్ల పెద్ద చెట్లు కూలిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు వెంటనే వాటిని తొలగించారు. ముంపు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించి వసతి కల్పించారు.



దక్కిలి: మార్లగుంట గిరిజనులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీవో ప్రసన్నకుమారి



తడ: భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు



తడ: జాతీయ రహదారిపై విరిగి పడిన చెట్లను తొలగిస్తున్న ఎస్ఐ జేపీ శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది



సైదాపురం: రోడ్డు పడిపోయిన చెట్లను తొలగిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో



సైదాపురం: ఊటుకూరు మాలేరు వద్ద ఎస్ఐ చల్లావాసు



సైదాపురం: బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న నేతలు



వెంకటగిరి : ఆహార పొట్లాలను అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్



మావిళ్లపాడు గ్రామ సమీపంలో నెర్రికాలువలో వరద నీటి ఉధృతి



దొరవారిసత్రం వెదురుపట్టు వద్ద చెరువులా మారిన పంట పొలాలు



పెళ్లకూరు: కానూరు గిరిజన కాలనీలో పర్యటిస్తున్న తహసీల్దార్ రామయ్య, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి



పెళ్లకూరు: పాలచ్చూరు వద్ద చెప్టాపై వరద నీటి ప్రవాహం



దొరవారిసత్రం: మేలనత్తూరు చెరువు కట్టపై ఇసుక బస్తాలు వేస్తున్నరైతులు



ఓజిలి: కుందాంలో కూలిన ఇంటి గోడ



ఓజిలి: చప్టాపై వెళుతున్న ప్రజలకు హెచ్చరికలు చేస్తున్న తహసీల్దార్ శివరామసుబ్బయ్య

తీరంలో మత్స్యకారులకు భరోసా

చిల్లకూరు : మండలంలోని మత్స్యకారులు భారీ వర్షానికి ఇబ్బంది పడకుండా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం గుమ్మళ్లదిబ్బ, వరగలి, మోమిడి గ్రామాల్లో పర్యటించి మత్స్యకారుల పడవలను ఒడ్డుకు చేర్పించారు. వలలకు భద్రత కల్పించారు. తుపాను పూర్తిగా ఆగిపోయేవరకు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖాధికారి రఘుబాబు సూచించారు. జల దిగ్బంధంలో ఉన్న తిప్పగుంటపాళెం వాసులను రక్షించేందుకు రెండు ఇంజిను బోట్లను తరలించినట్లు పేర్కొన్నారు. మత్స్యశాఖ సహాయకులు రవికుమార్, హజీరా, విజయ పాల్గొన్నారు.



చిల్లకూరు : మత్స్యకారులకు సూచనలు ఇస్తున్న అధికారులు

కండలేరులో 11.635 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 11.635 టీఎంసీల నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి జలాశయానికి 1800 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రొయ్యల గుంత వద్ద ఇరుక్కుపోయిన గిరిజనులు

చిట్టమూరు : భారీ వర్షానికి మండలంలోని పిట్టువానిపల్లి సమీపంలో ఉన్న రొయ్యగుంత వద్ద కాపలా ఉండే 15 మంది గిరిజనులు సోమవారం చిక్కుపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వంకా రమణయ్య వెంటనే తహసీల్దార్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వారిని పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతి కల్పించారు. డీటీ నిరంజన్‌కుమార్, ఆర్ఐ మధులత, మనోహర్ గౌడ్ పాల్గొన్నారు.



చిట్టమూరు : రొయ్యల గుంతల వద్ద ఉన్న వారిని తీసుకువస్తున్న రెవెన్యూ సిబ్బంది